ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17.07.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రైతు రుణ మాఫీ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ లబ్ధిదారులతో కలిసి సంబురాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
2. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమావేశం ఈరోజు హైదరాబాదులోని ప్రజాభవన్‌లో జరుగుతుంది.
3. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ప్రజలు మొహర్రం, తొలి ఏకాదశి పర్వ దినాలను ప్రజలు జరుపుకుంటున్నారు.
4. రాష్ట్రంలో ఈ రోజు భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రేపటి నుండి మూడు రోజులపాటు పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆ శాఖ పేర్కొంది.

-----

**రుణమాఫీ**

రైతు రుణ మాఫీ రేపు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్ధిదారులతో కలిసి సంబురాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా రేపు సాయంత్రం లోగా లబ్ది దారుల ఖాతాల్లో లక్ష రూపాయల లోపు మాఫీ సొమ్మును జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేసింది. కుటుంబ వివరాలను గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు నిబంధన విధించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న కలెక్టర్ల సదస్సులో చెప్పారు. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికి కూడా రుణ మాఫీ పథకాన్ని వర్తింపజేస్తామని ఆయన వివరించారు.

**-DESK**

అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం

రుణ మాఫీ విషయంలో మాట ఇచ్చి, నిలబెట్టుకున్నామని రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అన్నదాతలకు ఆర్థిక సహకారం అందజేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణ విముక్తి కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. లక్ష రూపాయల రుణమాఫీ సాధ్యం కాదని, ఆనాటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకుని అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని ఈ ప్రకటనలో తెలిపారు.

పి ఎన్

**TPCC**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమావేశం ఈరోజు జరుగుతుంది. ప్రజాభవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధ్యక్షత వహిస్తారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిర్వహిస్తున్నతొలి పార్టీ సమావేశమిది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ కార్యవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొంటారు. సమావేశంలో పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తారని భావిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంపై ముఖ్య నాయకులకు మార్గదర్శనం చేసే అవకాశం ఉంది. రేపటి నుండి రుణమాఫీ ప్రారంభమవుతున్న సందర్భంలో సంబురాలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ సంబురాలను పార్టీ పరంగా ఎలా చేయాలనే అంశంపై సమావేశంలో చర్చ జరిగే అవకాశాలున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ల అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయం చేసుకొని వెళ్లడంపై టీపీసీసీ చర్చించనున్నట్టు తెలుస్తోంది. డెస్క్

**IncomeTax**

ఆదాయపు పన్ను చెల్లింపు దారులు టీడీఎస్ మొత్తాన్ని తిరిగి పొందేందుకు తప్పుడు వివరాలను సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదాయపు పన్ను శాఖ హైదరాబాద్ రేంజి అదనపు కమిషనర్ సుమిత వెల్లడించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఆదాయపు పన్ను శాఖ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ గడిచిన ఆర్థిక సంవత్సరంలో చాలామంది ఉద్యోగులు వ్యాపారస్తులు తప్పుడు ఆదాయపు పన్ను వివరాలను సమర్పించి టీడీఎస్ అమౌంటు తిరిగి పొందినట్లు గుర్తించామని, వారందరికీ నోటీసులు ఇస్తామని తెలిపారు. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపు దారులు పన్ను చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు ఉపయోగించుకోవాలని సూచించారు.

**-Stringer, Mahabubnagar**

పిఎం ఏకాదశి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పాండురంగ విఠలుని ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి స్ఫూర్తిని సాయని సామాజిక మాధ్యమ పోస్టు ద్వారా నరేంద్రమోదీ పేర్కొన్నారు.

ఎన్ ఎస్ డి

TELANGANA MUHURRAM (WITH V/C)

దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఈరోజు మొహరం పాటిస్తున్నారు. సంప్రదాయబద్ధ తాజియా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదారబాద్ లో ఈరోజు మొహరం సందర్భంగా తాజియా ప్రదర్శనలు, ప్రత్యేక ప్రార్ధనా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నగరంలో మొహరం ప్రదర్శన ఈ మధ్యాహ్నం ముగుస్తుంది.

ఎన్ ఎస్ డి

**Toli Ekadashi & Moharram**

త్యాగ నిరతికి, సహనానికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సందేశాల్లో పేర్కొన్నారు. తరతరాలుగా గ్రామాల్లో మతాలకు అతీతంగా పీర్ల ఊరేగింపులు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల మధ్య ఐక్యతకు, సఖ్యతకు వారధిగా మొహర్రం నిలుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పీర్ల ఊరేగింపు మత సౌభ్రాతృత్వానికి నిదర్శనమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు. ఈరోజు తొలి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ ఏకాదశి పర్వదినం తెలంగాణప్రజల జీవితాల్లో సుఖశాంతులు, సకల శుభాలు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష వ్యక్తం చేశారు. డెస్క్

**Toli Ekadashi- Rajanna siricilla**

వరంగల్ నగరంలోని ఉర్సు, కరీమాబాద్ లలో నేడు తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బీరన్న స్వామి బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొంటారు. భక్తులు బీరన్న స్వామికి బోనాలు సమర్పించి పట్నాలు వేసి మొక్కలు తీర్చుకోవడానికి బీరన్న ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. ఈ మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో మహిళలు డప్పు

విన్యాసాలతో పెద్ద ఎత్తున బీరన్న స్వామికి బోనాలను తీసుకుని ఆలయానికి వెళతారు. ఇందులో మంత్రి కొండా సురేఖ కూడా బోనమెత్తుతారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ స్వామివారికి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, పరివార దేవతార్చనలు చేశారు. రుక్మిణీవిఠళేశ్వర స్వామికి పంచోపనిషత్ ద్వారా అభిషేకాలు మహాపూజ తదితర పూజలు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో కొప్పుల వినోద్ రెడ్డి చెప్పారు.

**-PTC, WGL, Rajanna siricilla**

**Toli Ekadashi- 2**

ఈ రోజు తొలి ఏకాదశి కావడంతో రాష్ట్రమంతటా దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. యాదగిరిగుట్ట, బాసర, శ్రీశైలం, వేములవాడ, భద్రాచలం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కొందరు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉపవాస దీక్షలు చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వర ఆలయం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు, అధికారులు కాలినడకన గోదావరి నదిలో త్రివేణి సంగమం వద్దకు చేరుకున్నారు.

ఏకాదశి పండుగను పురస్కరించుకొని ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండల కేంద్రం రంగనాయక స్వామి ఆలయంలో సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. **Desk, PTC, Asifabad**

**Festivals-Janagaon**

ధర్మ పరిరక్షణకు, ప్రజల ఐక్యతకు ప్రతీకగా మొహర్రం, తొలి ఏకాదశి పండుగలు నిలుస్తాయని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా ప్రజలందరికీ ఆయన మొహర్రం, తొలి ఏకాదశి పండగల శుభాకాంక్షలు తెలిపారు. కర్బలా యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ధైర్యం, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. పిటిసి జనగామ.

**Moharram-Districts**

ఆసిఫాబాద్ జిల్లాలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా మండలాల్లో ఏర్పాటు చేసిన పీరీలను ప్రతి గ్రామంలో తిప్పుతూ ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామస్తులు వారి మొక్కలు తీర్చుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పిటిసి ఆసిఫాబాద్.

**Rains**

రాష్ట్రంలో ఈ రోజు భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రేపటి నుండి మూడు రోజులపాటు పలు చోట్ల భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురుస్తాయని ఆ శాఖ పేర్కొంది. ఈ మేరకు పలు జిల్లాలకు నారింజ రంగు హెచ్చరికలు జారీ చేసింది. తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడటం, విద్యుత్ సరఫరా స్తంభించడం, లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు ఏర్పడటం వంటివి జరగవచ్చని పేర్కొంది. రేపు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్, నల్గొండ, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు భారీగా కురుస్తాయని తెలిపింది.

Rains-Asifabad

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో విపత్తు నిర్వహణ కోసం 30 మందిని ప్రత్యేకంగా నియమించినట్టు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని, వచ్చే ఐదు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్లలో నుండి బయటికి వెళ్లకూడదని సూచించారు.

ఆసిఫాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 652 క్యూసెక్కుల నీటిని నిన్న ఉదయం నుండి బయటికి వదులుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో గేట్లను ఒక మీటర్ పైకి ఎత్తి 1352 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. మండలంలోని మరో ప్రాజెక్టు వట్టివాగు కూడా సామర్థ్యం కంటే ఎక్కువగా నీరు వస్తున్న నేపథ్యంలో ఈ రోజు గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. **-PTC,** Asifabad

TESCO

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు టెస్కో రూ.9.50 కోట్ల విలువైన బట్ట ఉత్పత్తి ఆర్డర్లను ఇచ్చిందని, చేనేత జౌళి శాఖ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎడి మిట్ట కోల సాగర్ తెలిపారు. సంక్షేమ శాఖలకు సంబంధించి అవసరమైన బట్ట ఉత్పత్తి కోసం సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 18 లక్షల మీటర్లు ఆర్డర్లు వచ్చాయని చెప్పారు. ఇందులో సిరిసిల్ల మరమగ్గాలపై 13 లక్షల షర్టింగ్ బట్ట, టెక్స్టైల్ పార్కులో 5 లక్షల మీటర్ల షూటింగ్ బట్ట ఉత్పత్తి ఆర్డర్లు వచ్చాయన్నారు. షర్టింగ్ కు సంబంధించి రూ.41.50 పైసలు, సూటింగ్ కు సంబంధించి రూ.88 వరకు లభించనుందన్నారు.. రెండు నెలలపాటు సాంచాలకు, నేత కార్మికులకు పని ఉంటుందని తెలిపారు.

**-PTC, Rajanna siricilla**

వరంగల్ - సీజనల్

సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాలని, మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గర్భిణీ వివరాలను నమోదు చేసి వారికి మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. డి ఎం హెచ్ ఓ కార్యాలయం నుండి ఈరోజు ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు ధనుర్వాత టీకా, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు, వివిధ పరీక్షలు నిర్వహించి తగిన విధంగా సేవలు అందించాలని వైద్య అధికారులకు ఆయన సూచించారు. వరంగల్ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పైన దృష్టి పెట్టాలని ఎక్కడైనా గ్రామాలలో జ్వరాలు అధికంగా ఉంటే తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు .మహిళలకు మానసిక సమస్యల పైన కౌన్సిలింగ్ ఇవ్వడానికి వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఈ విషయంలో కూడా ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. గ్రామాలలో ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జిల్లాలో 587 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా 528 మంది టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ ఇచ్చామని, రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజం తెలిపారు. ప్రియదర్శిని, పూర్వ ప్రాథమిక విద్యాకర దీపిక పుస్తకాలను వెలువరించామన్నారు. వీటిపై ప్రతీ టీచరుకు మూడు రోజుల పాటు, పిల్లల సమగ్రాభివృద్ధిలో భాగంగా శారీరక, కండర, చలన అభివృద్ధి, భాషా, అక్షరాస్యత, సాంఘీక, భావోద్వేగ, నైతిక అభివృద్ధి, సాంస్కృతిక, రసాస్వాదన

అభివృద్ధి, మేధో అభివృద్ధిని మెరుగుపర్చడానికి, అధునాతన డిజిటల్ సౌండ్ సిస్టమ్, రంగుల రంగుల చార్ట్ లు, అందించి ప్రకృతి సహాయంగా దొరికే వస్తువుల ద్వారా పిల్లలకు అభ్యాసన సామగ్రిని ఎలా అందించాలనే దానిపై శిక్షణ ఇచ్చామన్నారు.

- పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయ్యింది. ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీకి ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం సహకరించపోయినా కూడా రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం. ఆగష్టు 15వ తేదీ లోగా రైతు రుణాలను మాఫీ చేస్తామని, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. కానీ, అంతకంటే నెలరోజుల ముందుగానే హామీని నిలబెట్టుకుని రైతన్నల విషయంలో తమ నిబద్ధతను చాటుకున్నామని అన్నారు.

జూలై 18వ తేదీ లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తున్నామని ఆ రోజు సాయంత్రం వరకు రైతు ఋణ ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నామని ఈరోజు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవలసిన రోజు అని అన్నారు.

16 సంవత్సరాల క్రితం కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి సంబంధించి 72 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలు, వడ్డీలను మాఫీ చేసిందని గుర్తు చేశారు.

తెలంగాణలో వ్యవసాయం మరింత లాభసాటిగా మారాలి.. అంతిమంగా రైతు సోదరులు ఆర్థికంగా బలపడడానికి రైతాంగానికి ఎల్లవేళలా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం దండుగా కాదు పండుగ అనే విధంగా పరిస్థితిని మారుస్తున్నామని రైతన్న కష్టాలు కడతేర్చాలని నడుంబిగించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నది. వ్యవసాయ రంగం బాగుంటేనే రాష్ట్ర ప్రజలు రాష్ట్ర బాగుంటుంది, వ్యవసాయ రంగం అభివృద్ధికి మించిన ప్రాధాన్యత ఈ ప్రభుత్వానికి మరొకటి లేదు. భవిష్యత్తులో వ్యవసాయాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. రాబోయే కాలంలో ప్రభుత్వం రైతులకు మరింత అండగా నిలుస్తుంది. రైతును రాజు చేయాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యం. ఈ లక్ష్యం చేరుకోవడానికి పంట రుణ మాఫీ పథకం ద్వారా రైతన్నలకు

మంచి ప్రారంభం లభించిందన్నారు.